తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

సోమవారం

16 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలి


నిరుద్యోగ యువతకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అండ

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు

మంథని, నవంబర్ 15 (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో శ్రీ విశ్వ అకాడమీ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత మన ఊరు ? మన కోచింగ్ సెంటర్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం మంథని పట్టణంలోని శివకిరణ్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న దుద్దిళ్ల శ్రీను బాబు అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల సాధనలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు, ప్రతిరోజూ మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ఉచిత కోచింగ్, భోజన సదుపాయాలు కల్పిస్తూ వారి పోలీస్ ఉద్యోగాల సాధనకు మంత్రి శ్రీధర్ బాబు అండగా నిలుస్తున్నారని అన్నారు. దాదాపు 120 రోజులు పూర్తి కావస్తున్నందున ఈ శిక్షణ కార్యక్రమాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని పేర్కొన్నారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ మంచి ఫలితాలు సాధించి తమ కుటుంబాలకు, ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని దుద్దిళ్ల శ్రీను బాబు ఆకాంక్షించారు.





జీవిత కాలం ఒకే జెండా మోయడం కమ్యూనిస్టు కార్యకర్తలకే సాధ్యం

- సీపీఐ సీనియర్ నాయకులు మధునయ్య సంస్మరణ సభ..
- నివాళులు అర్పించిన సీపీఐ శ్రేణులు..

గోదావరిఖని, జనంసాక్షి :

సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి ఆసాల మధునయ్య సంస్మరణ సభ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి సిరిసిల్ల మల్లేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య మధునయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సీనియర్ నాయకులు లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆసాల మధునయ్య మరణం పార్టీకి తీరనిలోటని,ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లెనిన్‌నగర్ శాఖ నిర్మాణంలో ముందు నుండి పనిచేయడం గాక ఆ బస్తీకి లెనిన్‌నగర్ అనే పేరును పెట్టి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఎంతగానో కృషిచేసిన నాయకుడు అని అన్నారు.పూటకు ఒక జెండా పూటకో కండువా మారుస్తున్న కాలంలో నీతినిజాయితీలకు కట్టుబడి, కడవరకు కమ్యూనిస్టు పార్టీ జెండాను భుజానమోసిన మధునయ్య సేవలను స్మరించారు. జీవితకాలం ఒకే జెండా మోసేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో కే.స్వామి, మాటేటి శంకర్, రాజారత్నం, అసాల రమ, రేణిగుంట్ల ప్రీతం, ఆసాలా నవీన్, శనిగరపు చంద్రశేఖర్,అబ్దుల్‌కరీం,తోడుపునురి రమేష్‌కుమార్, అసాల కొమురయ్య, కొండ్రా రాజయ్య, మధునయ్య కుటుంబ సభ్యులు, ఆసాల లెనిన్, ఆసాల కిషోర్, తదితరులు ఉన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

- బాధితులకు తక్షణ న్యాయం అందించాలి..
- ఓట్లు తొలగిస్తున్న ఎస్ఐఆర్‌ను పూర్తిగా రద్దు చేయాలి..
- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కోడి పుంజుల జ్యోతి..



గోదావరిఖని, జనంసాక్షి :

స్థానిక ఐఎఫ్‌టీయు కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) పెద్దపెల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి హాజరై మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళలు నేటికీ అనేక రకాల భద్రతా,ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మహిళల హక్కుల పరిరక్షణ, సాధికారత కోసం ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పని ప్రదేశాలు, విద్యా సంస్థలు,బహిరంగ ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, హింసను అరికట్టడానికి కఠినమైన చట్టాలను అమలు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించాలని కోరారు.దేశంలో బిజెపి కనుసనల్లో నడుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్ఐఆర్ మూలంగా అత్యధికంగా ఏడు కోట్లకు పైగా మహిళా ఓట్లను తొలగించే కుట్ర జరుగుతుందన్నారు.దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగంలో,ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు

వార్తా లోపలి పేజీలో

హెల్మెట్ తప్పనిసరి..

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా

ప్రజలకు ఇందల్వాయి ఎస్ఐ సుమలత సూచనలు

నిజాంబాద్ జిల్లా ఇందల్వాయి జనంసాక్షి :

టోల్ ప్లాజా వద్ద మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా టూ వీలర్ బయటకు వెళ్ళేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని లేనిచో తగు జరిమానా తలుగుతుందని మరి మద్యం తాగి వెహికల్ నడపవద్దని పోలీసులు సూచించారు. అందరూ వెహికల్ నడిపే వాళ్ళు తగు జాగ్రత్తలు తప్పనిసరి తగు జాగ్రత్తలు తీసుకోవాలి వెహికల్ కి డ్రైవింగ్ లైసెన్స్ సంబంధించిన డాక్యుమెంట్స్ అనేది కచ్చితంగా ఉండాలి ఇన్సూరెన్స్ ఉండాలి టూ వీలర్స్ నడిపే వాళ్ళు ఖచ్చితంగా పొల్యూషన్ చక ప్రతి సంవత్సరం స్లిప్పు ఉండాలని దాంతోపాటు మద్యం తాగినప్పుడు వెహికల్ నడపకూడదని వెహికల్ నడిపితే ఫైన్ వేయబడుతుందని అందరూ తప్పకుండా సూచనలు పాటిస్తార మీ మరియు వెహికల్ చెకింగ్ సహకరించాలని మండల ప్రజలకు తెలియజేశారు చేయడం జరుగుతుంది ఎస్ఐ సుమలత తెలియజేశారు.



నేడు కలెక్టరేట్‌లో బాలల ప్రజావాణి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: బాలల హక్కుల వారోత్సవంను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయంలో ఈ నెల 16న ప్రత్యేకంగా బాలల ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ప్రతి సోమవారం యధావిధిగా కొనసాగే ప్రజావాణితో పాటే 16న బాలల ప్రజావాణి కొనసాగుతుందని అన్నారు. ప్రత్యేక బాలల ప్రజావాణిలో బాలబాలికలు విద్య, వైద్యం, రవాణా, సంక్షేమం తదితర సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులచే సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. బాలల ప్రజావాణికి వచ్చే పిల్లల సౌకర్యార్థం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయిస్తు న్నామని అన్నారు.

ఇందూర్‌లో భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: ఇందూర్ పట్టణంలోని గిరిజన వసతి గృహంలో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో గిరిజన ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ గిరిజన మోర్చా నాయకులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీ ఓం సింగ్ నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల హక్కుల పరిరక్షణ మరియు ఆత్మగౌరవం కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి గిరిజన బిడ్డలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శులు కెలుత్ పీర్ సింగ్ నాయక్ చౌహాన్, రాథోడ్ సుందర్ సింగ్ నాయక్, ఉపాధ్యక్షుడు రవి నాయక్, వసతి గృహ విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యవర్గంలో గడ్డం ఇందుప్రియకు కీలక బాధ్యత



కామారెడ్డి నవంబర్ 15 (జనం సాక్షి) కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్‌లో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడం పట్ల కామారెడ్డి ప్రాంత కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా గడ్డం ఇందుప్రియకు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయ పూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆమె చేస్తున్న కృషి, పార్టీ పట్ల చూపుతున్న అంకితభావం, నిరంతర సేవలకు ఈ నియామకం తగిన గుర్తింపుగా నిలిచిందని నాయకులు అభిప్రాయపడ్డారు.రాష్ట్రస్థాయిలో జనరల్ సెక్రటరీగా కొత్త బాధ్యతలు చేపట్టనున్న ఇందుప్రియ మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళల హక్కుల సాధన, వారి సమస్యల పరిష్కారం కోసం చురుకుగా పనిచేస్తారని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.తనకు ఈ అవకాశం కల్పించిన ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణలతకు ఇందుప్రియ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

భూముల రీసర్వే ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలి

అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు



భీంగల్ నవంబర్ 15 జనం సాక్షి: భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆదివారం భీంగల్ మండలం బాచన్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న రీసర్వే పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో భాగంగా భూముల హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం, భూ విస్తీర్ణాన్ని కొలవడం, సంబంధిత భూ రికార్డులతో వివరాలను సరిపోల్చడం తదితర ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించారు.రీసర్వే సమయంలో ప్రతి భూమికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, భూ యజమానుల వివరాలు, సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, హద్దులు తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో వివరాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలను సంబంధిత రికార్డులతో సరి చూసుకోవాలని అన్నారు. భూ యజమానులకు ముందస్తు సమాచారం అందిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని, భూముల హద్దులు, విస్తీర్ణంపై వారికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి వెంటదివెంట పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రీసర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులు మరింత కచ్చితత్వంతో అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్‌లో భూ వివాదాలను తగ్గించేందుకు ఇది దోహద పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని, ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. రీసర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కొనసాగేలా చూడాలని తహసీల్దార్ ను ఆదేశించారు.రీ సర్వే కోసం వినియోగిస్తున్న రోవర్ మెషిన్లను మరిన్ని జిల్లాకు తెప్పిస్తున్నామని, వీటిని వినియోగిస్తూ అదనపు బృందాలను ఏర్పాటు చేసి సకాలంలో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్ల సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ఉత్తమ పనితీరు కనబర్చే సర్వేయర్లకు ప్రతి నెల ప్రోత్సాహక బహుమతిగా నగదు పారితోషికాలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డీ అశోక్, తహసీల్దార్ కిరణ్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

జన ఔషధీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం

జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి:నిజామాబాద్ జిల్లాలోని గండ్ర క్రికెట్ మైదానంలో రితేష్ పటేల్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన జన ఔషధీ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. వివిధ ప్రాంతాలకు చెందిన క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నాయి.ఆర్మూర్‌కు చెందిన సల్లు క్రికెట్ అకాడమీ, కామారెడ్డికి చెందిన అకాడమీ మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో సల్లు క్రికెట్ అకాడమీ విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది.ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన సల్లు క్రికెట్ అకాడమీకి ట్రోఫీతో పాటు జట్టు క్రీడాకారులకు మెడల్స్ అందించారు. ఈ టోర్నమెంట్‌లో ఆద్యంతం నిలకడగా రాణించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కార్తికేయ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా, ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన లక్ష్మీనివాస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజయం సాధించిన వారు మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని, ఓటమి పాలైన వారు నిరుత్సాహపడకుండా పట్టుదలతో సాధన చేయాలని సూచించారు. యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

జన ఔషధీ సేవలు వినియోగించుకోవాలి

ప్రజలకు నాణ్యమైన మందులను అతి తక్కువ ధరలకు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన ప్రజారోగ్య రంగంలో గొప్ప మార్పుకు నాంది పలికిందని పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. కేవలం ఆరోగ్య రంగానికే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతతో యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజాసేవతో పాటు సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం జన ఔషధీ వేదికగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

రితేష్ పటేల్ కృషి అభినందనీయం

రితేష్ పటేల్ చొరవతో నాలుగు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పల్లె గంగారెడ్డి అన్నారు. స్థానిక క్రీడాకారులకు మంచి వేదిక కల్పిస్తూ, వివిధ ప్రాంతాల జట్ల మధ్య పోటీలు నిర్వహించడం ద్వారా యువ ప్రతిభను ప్రోత్సహించడంలో రితేష్ పటేల్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మరిన్ని క్రీడా, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన నిర్వాహకులు, క్రీడాకారులు, సహకరించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు.

అంగరంగ వైభవంగా నింబాచాల క్షేత్రంలో కార్తీకమాస బ్రహ్మోత్సవాలు



భీంగల్ నవంబర్ 15 జనం సాక్షి:జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీమన్నింబాచల క్షేత్రంలో కార్తీక మాస బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భీంగల్ పట్టణంలోని అత్యంత ప్రాచీనమైన గ్రామాలయంలో ఏడాది పొడవునా పూజలందుకున్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం కొండపైకి తీసుకెళ్లారు.బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని గ్రామాలయంలో అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ఊరేగింపుగా కొండకు బయలుదేరారు. బోయలు పల్లకిని మోస్తుండగా మేళతాళాలు, భక్తి కీర్తనలు, సుహాసినిలు మంగళ హారతులు మధ్య ఊరేగింపునకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. మహిళలు సువాసినులు నెత్తిన బోనాలు ధరించి భక్తిపారవశ్యంతో స్వామివారి పల్లకిని అనుసరించారు. గుట్ట పైకి సాగిన ఈ ఆధ్యాత్మిక ఊరేగింపులో పట్టణ ప్రజలు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మార్గమధ్యంలో భక్తులు పల్లకిలో కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుని కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అడుగడుగునా భక్తుల నీరాజనాలు, గోవింద నామస్మరణతో భీంగల్ పురవీధులు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.సాయంత్రం ఉత్సవ విగ్రహాలు శ్రీమన్నింబాచల క్షేత్రానికి చేరుకోగా ఆలయ అర్చకులు నంబి పార్థసారథి కుటుంబ సభ్యులు సంప్రదాయ ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కీర్తివర్ధనం ప్రమాణాన్ని అనుసరించి పూజలు జరిపి, శ్రీమన్నారాయణుని అర్చావతార వైభవాన్ని చాటిచెప్పే పాంచరాత్ర ఆగమ సంప్రదాయం ప్రకారం కార్తీక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.కార్తీక మాసం విష్ణుమూర్తి ఆరాధనకు అత్యంత పవిత్రమైన మాసంగా భావిస్తారు. ఈ మాసంలో స్వామివారి దర్శనం, దీపారాధన, నామస్మరణ, పూజలు చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ప్రతి ఏడాది గ్రామాలయం నుంచి కొండపైకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లే ఈ సంప్రదాయం భీంగల్ ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు, తరతరాలుగా కొనసాగుతున్న భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది.స్వామివారి కొండకేగే కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొనడంతో శ్రీమన్నింబాచల క్షేత్ర పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి. కార్తీక బ్రహ్మోత్సవాల ప్రారంభంతో రానున్న రోజుల్లో స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి మరింత పెరగనుంది..

పింఛన్ లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం



కరీంనగర్ కల్చరల్, నవంబర్ 15,(జనం సాక్షి)కరీంనగర్: 11వ డివిజన్‌లో పెన్షన్ తుది జాబితాలో పేర్లు వచ్చిన మహిళలతో కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి టిఫిన్ చేస్తూ వారి సమస్యలు,యోగక్షేమాలు,అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల నర్మదా నర్సన్న మాట్లాడుతూ,పెన్షన్ ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని,ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని సూచించారు. పెన్షన్ తుది జాబితాలో పేర్లు వచ్చిన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు,పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు మాట్లాడుతూ,గతంలో ఎన్నో ఏళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూసినా మంజూరు కాలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు పెన్షన్ మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, అర్హుల కు పెన్షన్లు అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో,మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు, కరీంనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ మహిళలు,కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు చుక్కల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో కఠిన నిబంధనలు అమల్లోకి

పోలీసు కమిషనర్ హెచ్చరిక



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. నేటి నుండి ఈ నెల 30 వరకు ఈ నిబంధనలు ఖచ్చితంగా అమల్లో ఉంటాయని, ప్రజలందరూ సహకరించాలని పోలీస్ శాఖ సూచించింది. కమిషనరేట్ పరిధిలోప్రజలు పాటించాల్సిన కీలక నిబంధనలు విగ్రహాల ప్రతిష్టాపనకు అనుమతి తప్పనిసరి. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా, ముఖ్యంగా జనసమ్మర్ద ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్లు, ప్రభుత్వ భవనాల వద్ద ఎలాంటి విగ్రహాలు ఏర్పాటు చేయరాదు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతి ఉంటేనే విగ్రహాల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయడం వల్ల వృద్ధులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్ సిస్టమ్స్‌ను పూర్తిగా నిషేధించారు. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో 55 డెసిబెల్స్‌కు మించి శబ్దం చేయరాదు. ఇందుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పరిమితులకు మించిన శబ్దం చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్‌లను నిషేధించారు. 500 మందితో సమావేశాలు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ అనుమతి తీసుకోవాలి. అంతకంటే ఎక్కువ జనాలతో నిర్వహించే కార్యక్రమాలకు 72 గంటల ముందే పోలీస్ కమిషనర్ అనుమతి పొందాల్సి ఉంటుంది. సినిమా థియేటర్లు, మాల్స్, హోటళ్లు, ఎగ్జిబిషన్లు, వ్యాపార కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలి. ప్రజలందరూ క్యూ పద్ధతిని విధిగా అనుసరిం చాలని స్పష్టం చేశారు. డ్రోన్ల వాడకం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున, ఎవరైనా ప్రజా ప్రయోజనాల కోసం డ్రోన్లు వాడదలిస్తే ప్రభుత్వ సంస్థలు, పోలీసు, ఏవియేషన్ అధికారుల నుండి ముందస్తు క్లియరెన్స్ తీసుకోవాలి. ఉపాధి పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ హెచ్చరించారు. గల్ఫ్ ఏజెంట్లకు ఎవరికైనా ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు వారి వివరాలను స్థానిక పోలీసులకు అందించాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మైనర్లకు 'ఏ' సర్టిఫికెట్ సినిమాలు బంద్. జిల్లాలోని సినిమా థియేటర్లలో 'ఏ' (పెద్దలు మాత్రమే) సర్టిఫికెట్ పొందిన సినిమాలను వీక్షించడానికి మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు. వీధులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మహిళలు, పిల్లలు, దారిపోవువారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే ఈ చర్యను పోలీస్ శాఖ పూర్తిగా నిషేధించింది. ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని ఎస్.హెచ్.ఓ, ఎస్.ఐ లు చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటారని సీపీ స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి పౌరులంతా సహకరించాలని సీపీ కోరారు.

విశ్వహిత శతకం పుస్తకావిష్కరణ



ప్రపంచ హితం కోసం కవులు పునరంకితం కావాలి

కాళోజీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 15 (జనం సాక్షి): ప్రపంచ హితం కోసం కవులు మరోసారి పునరంకితం కావాల్సిన అవసరం ఉందని బహుభాషావేత్త, కాళోజీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న సంఘర్షణలు, సమస్యలను వెలికితీసి ప్రజలకు తెలియజేయడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కవి వెంగళ లక్ష్మణ్ రచించిన 'విశ్వహిత శతకం' పుస్తకాన్ని నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే సంఘర్షణలు, పరిణామాలను నిశితంగా పరిశీలించి వాటిపై స్పందిస్తూ రచించిన పుస్తకమే విశ్వహిత శతకమని అన్నారు. తన కళ్లముందు జరుగుతున్న సంఘటనలను చూసి చలించి, వ్యాకులతకు గురై, ఆందోళనతో కలాన్ని కదిలించిన సందర్భాలు ఈ రచనలో ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. మనసుపెట్టి చదివితే ఇక్కడి మట్టి, గాలి, పరిసరాల ప్రభావంతో కవుల అంతరంగిక వేదన, సామాజిక స్పృహ అర్థమవుతాయని వివరించారు. సిరిసిల్ల నుంచి పలువురు కవులు తమ రచనల ద్వారా సమాజ హితాన్ని చాటుతున్నారని కొనియాడారు. ఈ పుస్తకంలోని పదాలు, పద్యాలు సామాన్య పాఠకులకు సైతం సులభంగా అర్థమయ్యేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సాహిత్యం ద్వారా సమాజంలోని సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయమని అన్నారు. రచయిత వెంగళ లక్ష్మణ్ రచనలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జనపాల శంకరయ్య, జూకంటి జగన్నాథం, బుర్ర గోపాల్‌తో పాటు పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

గన్నేరువరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



గన్నేరువరం, నవంబర్ 15 (జనంసాక్షి):గన్నేరువరం మండల కేంద్రంలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. హకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాన్ని బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్ , సర్పంచ్ రంగనవేణి లచ్చనర్సు తోకలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ధాన్యం తూకంలో పారదర్శకత పాటిస్తామని, రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు దేశరాజు అనిల్, మైసంపల్లి తిరుపతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కటకం తిరుపతి, వివిధ గ్రామాల సర్పంచులు మాదరి శ్రీనివాస్, నందికొండ అంజిరెడ్డి, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, చాకలివానిపల్లె గ్రామ శాఖ అధ్యక్షులు కూన చంద్రశేఖర్, నాయకులు బుర్ర తిరుపతి గౌడ్, బుర్ర మల్లేశం గౌడ్, పాకాల పరశురాం, మునీగంటి రాములు, ఒల్లెల కనకయ్య, రాపోల్ రాములు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్మెడ



కథలాపూర్ నవంబర్ 15(జనం సాక్షి)కథలాపూర్ మండల సీనియర్ నాయకులు గడ్డం భూమారెడ్డి వారి యొక్క అల్లుడి వివాహం ఇటీవల జరుగగా కోరుట్ల నియోజకవర్గంలోనీ కోనరావుపేటకు గ్రామంలోని వివాహ విందు కార్యక్రమం లోని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పాలుగొని నూతన వధూవరులను ఆదివారం రోజు కలిసి ఆశీర్వదించారు. వారి వెంట సర్పంచులు మకిలి దాస్, రాజోజీ చారి, గంగా రెడ్డి, అజిత్ రావు నాయకులు కుమార్, గడ్డం దివాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కుంచెతో మెరిసిన చిన్నారులు ఉపగ్న హోమ్స్‌లో

పారమిత వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు



కరీంనగర్, క్రైమ్ నవంబర్ 15 (జనంసాక్షి) :చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పారమిత వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ లోని ఉపగ్న హోమ్స్ వేదికగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలకు ఒకటవ తరగతి నుండి పది తరగతి వరకు సుమారు 50 మంది చిన్నారులు హాజరై తమ కుంచెకు పనిచెప్పారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ గుజ్జుల శ్వేత విచ్చేసి, చిన్నారులు వేసిన చిత్రాలను పరిశీలించి అభినందించారు. అనంతరం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొలం మల్లేష్, ఉపగ్న హోమ్స్ అధ్యక్షుడు సిహెచ్. రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సాగర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, వి.యు.ఎం. ప్రసాద్, ప్రధానాచార్యులు శ్రీకర్, విద్యా సమన్వయకర్త దీప్తిరాణి, ఉపాధ్యాయులు, కాలనీ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధిని బీజేపీ అడ్డుకుంటోంది

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు



సిరిసిల్ల టౌన్ నవంబర్ 15 (జనం సాక్షి) : తెలంగాణకు వస్తున్న పెట్టుబడులను, యువతకు ఉద్యో గ అవకాశాలను బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు విమర్శించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో పట్టణకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ ప్రధాని మోడీ అమిత్ షాలు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతులను చూసి బీజేపీ ప్రభుత్వం భయపడుతోందని, రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనను అడ్డుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్లు, అంతర్జాతీయ పర్యటనల ద్వారా వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకుంటుంటే బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపో తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, గడ్డం నర సయ్య, రాగుల జగన్, షేక్ రియాజ్, కొలనూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌కి నూతనంగా వికలాంగుల పింఛన్ మంజూరు



జనం సాక్షి రాయికల్ నవంబర్ 15 :జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదా రునికి పింఛన్ మంజూరు ఉత్తర్వులు అందజేత -- త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇతర లబ్ధిదారులకు పంపిణీఅల్లీపూర్ గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నూతనంగా చేపట్టిన పింఛన్ పథకం ద్వారా పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా మంజూరైన పింఛన్ల ఉత్తర్వులను (ప్రొసీడింగ్స్) ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా అల్లీపూర్ గ్రామానికి చెందిన మొహ్మద్ ఇషాక్ (అషు)అను వికలాంగునికి పింఛన్ మంజూరు ఉత్తర్వులను అందజేయడం జరిగింది. అదేవి ధంగా, అల్లీపూర్ లో మంజూరు అయ్యిన ఇతర లబ్ధిదారులకు త్వరలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారి చేతుల మీదుగా పింఛన్ మంజూరు ఉత్తర్వులను అందజేయడం జరుగు తుందని సర్పంచ్ ఎంబారి గౌతమీ వెంకటేష్ తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

మంథని పట్టణ అభివృద్ధి పనులు వేగవంతం

మున్సిపల్ చైర్మన్ పొడ్నాల శ్రీనివాస్



మంథని, నవంబర్ 15 (జనం సాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని మున్సి పల్ చైర్మన్ పొడ్నాల శ్రీనివాస్ నూతన మున్సిపల్ కార్యా లయ నిర్మాణ పనులు, ఇంటిగ్రేటెడ్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు, బస్ స్టాండ్, రావుల చెరువు వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు, గోదావరి రోడ్డు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు మారుపాక నిహా రిక - నాగరాజు, పెంటరి రాజు, ఎల్లెంకి వంశీధర్ లతో కలిసి ఆది వారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ పొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో,పాటు మంథని మున్సి పాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంబోజు సమ్మయ్య, ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్, కాంట్రాక్టర్లు మరియు పాల్గొన్నారు.

పది మందికి సాయం చేసే గుణం రెడ్ల సొంతం

ప్రమాణ స్వీకారోత్సవంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



బోయినపల్లి, న్యూస్‌టుడే నవంబర్ 15 (జనం సాక్షి): రెడ్లు కష్టపడి ఆర్థికంగా ఎదగడంతో పాటు పది మందికి సాయం చేసే గొప్ప గుణం కలిగి ఉంటారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొనియాడారు. బోయినపల్లి మండల రెడ్డి సంఘ భవన నిర్మాణానికి, స్థల కేటాయింపునకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.భారీ ర్యాలీ.. పాలకవర్గ ప్రమాణ స్వీకారంఅంతకుముందు మండల రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయం నుంచి ప్రమాణ స్వీకార వేదిక వరకు కులస్తులు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల రెడ్డి సంఘం అధ్యక్షుడిగా చల్ల శ్రీనివాస్‌రెడ్డితో పాటు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంతో పాటు రాజకీయాల్లోనూ రెడ్లు ముందువరుసలో ఉంటున్నారన్నారు. చిన్నతనం నుంచే తనకు ఎంతోమంది రెడ్డి స్నేహితులు ఉన్నారని, తన రాజకీయ ఎదుగుదలలో వారు ఎంతో సహకరించారని గుర్తుచేసుకున్నారు. నియోజకవర్గంలో అర్హులైన పలువురు రెడ్లకు నామినేటెడ్ పోస్టులు కల్పించామన్నారు.రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీటరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత భారాస ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, వరి వేస్తే ఉరి అని భయపెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇస్తూ అన్నదాతలను ప్రోత్సహిస్తోందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, నూతన కార్యవర్గంఈ వేడుకల్లో మైత్రీ గ్రూప్ ఛైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముచ్చిడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముదిగంటి సురేందర్‌రెడ్డి, కోరెం సింగిల్ విండో ఛైర్మన్ వన్నెల మమత రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దబ్బు తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకుడు సంధి తిరుపతిరెడ్డి, వినోద్‌రెడ్డి, సర్పంచులు చింతలపల్లి కవిత వెంకట్‌రెడ్డి, నిమ్మ భాగ్యలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, నూతన కార్యవర్గ ఉపాధ్యక్షులుగా గుడి శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మానేరు లక్ష్మారెడ్డి, ముచ్చ శేఖర్‌రెడ్డి; కార్యదర్శిగా మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి; సంయుక్త కార్యదర్శులుగా పాశం నారాయణరెడ్డి, కంకణాల పురుషోత్తంరెడ్డి, మండలంలోని రెడ్డి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో భూలక్ష్మి మహాలక్ష్మి,బొడ్రాయి నూతన విగ్రహ ప్రతిష్టాపనకు భారీ విరాళం

హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు



వీణవంక నవంబర్ 15 (జనం సాక్షి) వీణవంక మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో భూలక్ష్మి,మహాలక్ష్మి,బొడ్రాయి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్య క్రమానికి హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు రెడ్డిపల్లి గ్రామానికిరూ.2,00,116 భారీ విరాళాన్ని గ్రామ సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డి,ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు గ్రామ ప్రజలకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఒడితల ప్రణవ్ బాబు మాట్లాడుతూ.. బొడ్రాయి తెలంగాణ గ్రామీణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామానికి బొడ్రాయి నాభిశిలగా, గ్రామదేవతలకు ప్రతినిధిగా భావిస్తారని తెలిపారు.గ్రామం మధ్యలో బొడ్రాయిని ప్రతిష్ఠించడం ద్వారా గ్రామ ప్రజలంతా ఐక్యంగా ఉండాలనే భావనను చాటుతుందని పేర్కొన్నారు,బొడ్రాయి ప్రతిష్ఠాపన కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని,గ్రామ ప్రజల మధ్య ఐక్యత,సోదరభావం,పరస్పర సహకారాన్ని పెంపొందించే గొప్ప సంప్రదాయమని ఒడితలఒడితల ప్రణవ్ బాబు అన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఇలాంటి ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు.భూలక్ష్మి,మహాలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.గ్రామంలో శాంతి, సౌభాగ్యం,వర్షాలు కురిసి రైతులు పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తన వంతు సహకారంగా రూ.2,00,116 అందించడం ఆనందంగా ఉందన్నారు.గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని ప్రణవ్ బాబు పేర్కొన్నారు.మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కర్ర భగవాన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి,మండల సీనియర్ నాయకులు ఎండి సాహెబ్ హుస్సేన్,చిన్నాల ఐలయ్య యాదవ్,గంగాడి తిరుపతి రెడ్డి,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,మాదాసి సునీల్,వావిలల సత్యనారాయణ, సర్పంచులు జడల శ్రీకాంత్, నాయకులు మాదాసి సునీల్,నల్ల కొండల్ రెడ్డి,అడిగొప్పుల సంపత్, హరీష్ రెడ్డి,అనిల్ రెడ్డి,ఉపేందర్ రెడ్డివార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావ్



ఎడపల్లి, నవంబర్ 15 (జనంసాక్షి) : రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే లక్ష్యంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావ్ ఆకాంక్షించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంఘం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిక్కెల లక్ష్మణ్‌తో పాటు నూతన డైరెక్టర్లను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన చైర్మన్, డైరెక్టర్లకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి నియామకానికి సహకరించిన నాయకులను, మద్దతుగా నిలిచిన గ్రామస్థులను సైతం సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాస్ రావ్ మాట్లాడుతూ, సహకార సంఘాలు గ్రామీణ ప్రాంత రైతాంగానికి ఎంతో కీలకమని, రైతులకు అవసరమైన సేవలు అందించడంలో సహకార సంఘం ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం నూతన చైర్మన్ చిక్కెల లక్ష్మణ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో కూడా చైర్మన్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందని, ప్రస్తుతం సహకార సంఘం ఆర్థికంగా కొంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటో ందని వివరించారు. ఇదిలా ఉండగా, గ్రామంలోని ముస్లిం స్మశానవాటిక ప్రహరీ గోడ పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ గ్రామ మైనార్టీ ప్రతినిధులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. స్మశానవాటికకు రక్షణ కల్పించేలా ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఇరెంటి లింగం, జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎంబ మోహన్, ఆత్మ చైర్మన్ కృష్ణరావు, సొసైటీ కార్యదర్శి గంగారెడ్డి, గ్రామ మైనార్టీ అధ్యక్షుడు తాహెర్, మజీద్ కమిటీ సదర్ అంజాద్ అలీ, ఈద్గా కమిటీ చైర్మన్ తబ్రేజ్, వైస్ చైర్మన్ సలీం, వార్డు సభ్యులు క్రాంతి, అజర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో బిర్లా ఓపెన్ మైండ్స్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్

2026 ఘన ముగింపు

బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ దాసరి ప్రశాంత్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో , నవంబర్ 15 (జనంసాక్షి) : బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించిన బిర్లా ఓపెన్ మైండ్స్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్ – 2026 ఆదివారం రోజు అట్టహాసంగా ముగిసింది. 5 దక్షిణాది రాష్ట్రాల నుంచి 13 బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. ఈ క్రీడా మహోత్సవంలో వివిధ విభాగాల్లో పోటీపడి అద్భుత ప్రతిభ కనబరిచిన బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. నవంబర్ 13న ప్రారంభమైన ఈ క్రీడా వేడుక నవంబర్ 15 వరకు 3 రోజుల పాటు కొనసాగింది. ఆర్చరీ, చెస్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, స్కేటింగ్, ఫుట్‌బాల్, క్రికెట్, తైక్వాండో, స్విమ్మింగ్ తదితర మొత్తం 13 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, బ్రాంచ్‌ల నుంచి వచ్చిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ముగింపు వేడుకలో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. క్రీడలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు, ట్రోఫీలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అత్యధిక విజయాలు సాధించిన బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయం పాఠశాల విద్యార్థుల కృషి , కోచ్‌ల శిక్షణ, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, యాజమాన్యం అందించిన సహకారానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అన్ని బ్రాంచ్‌ల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు, రిఫరీలు, నిర్వాహకులు, వాలంటీర్లు, సహాయక సిబ్బందికి, పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

రేకొండ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నూతన కమిటీల ఎన్నిక

సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలి
సమావేశంలో జిల్లా నాయకుల పిలుపు



చిగురుమామిడి నవంబర్ 15(జనంసాక్షి):మండలంలోని రేకొండ గ్రామంలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్ఎఫ్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నూతన గ్రామ కమిటీల ఎన్నికలను ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జ్ బుర్ర బిక్షపతి మాదిగ,ఎంఎస్ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జ్ చెంచాల నవీన్ మాదిగ,ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ,సీనియర్ నాయకులు శ్యామ్ సుందర్ మాదిగ,మాజీ మండల అధ్యక్షులు ఆలువాల సంపత్ హాజరయ్యారు.వీరి సమక్షంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా చెంచల సురేష్ మాదిగ,ఉపాధ్యక్షులుగా కండె అజయ్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా మేకల మహేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా మైలారపు సునీల్ మాదిగ, కార్యదర్శిగా గడిపే శ్రీకాంత్ మాదిగ, సహాయ కార్యదర్శిగా మైలారపు రఘు మాదిగ ఎన్నికైనట్టు తెలిపారు.ఎం.ఎస్.ఎఫ్ నూతన గ్రామ కమిటీ అధ్యక్షులుగా మేకల మధు మాదిగ,ఉపాధ్యక్షులుగా చెంచల ఈశ్వర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గడ్డం నందు మాదిగ, అధికార ప్రతినిధిగా కండే సాయికిరణ్ మాదిగ, కార్యదర్శిగా కొడిముంజ రఘు మాదిగ, కోశాధికారిగా కండె ప్రణయ్ మాదిగ ఎన్నికయ్యారు. అనంతరం జిల్లా నాయకులు మాట్లాడుతూ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తిప్పారపు శ్రీనివాస్, చెంచల నాగరాజు విచ్చేసిన ముఖ్య అతిథులను,నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు.

ఈ నెల 22న జరిగే ఎర్రన్న సంతాప సభను జయప్రదం చేయండి



ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి:ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రజల మనిషి అమరుడు అగ్గు ఎర్రన్న సంతాప సభను ఈనెల 22న ఆదివారం రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు మోపాల మండల కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఆనాడు జరిగే సభకు అధిక సంఖ్యలో రైతు కూలీలు ప్రజలు హాజరుకావాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య కోరారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్ ఆర్ భవన్లో ఎర్రన్న సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరించామని వారన్నారు.ఇట్టి సంతాప సభకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, వి. కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గౌని ఐలయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, ఆకుల పాపయ్య హాజరవుతున్నారని భూమయ్య అన్నారు.అగ్గు ఎర్రన్న బతికున్నంత కాలం రైతాంగ ఉద్యమాలలో, ప్రజా ఉద్యమాలలో, పనిచేశారని ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతు పంటలకు గిట్టుబాటు ధరలు రావాలని ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావాలని జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా ఎర్రన్న పాల్గొన్నారు.రైతులపై ప్రజలపై ముక్కు పిండి కరెంటు చార్జీలను పెంచుతూ అమలు చేయ చూస్తున్న విధానాలను విరమించుకోవాలని పోరాడిన గొప్ప నాయకుడని వారన్నారు.తానున్న ప్రాంతానికి సాగు తాగునీరుకై మధ్యలో ఆగిపోయిన మంచి 21 ప్యాకేజీ పనులకు తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని ఉద్యమించిన గొప్ప రైతు నాయకుడు ఎర్రన్న అని భూమయ్య అన్నారు.ఎర్రన్న జరిపిన పోరాటాలను మననం చేసుకొని రాబోయే రోజుల్లో బలమైన రైతు ఉద్యమ ఉద్యమాలు నిర్మించినప్పుడే ఆయనకు అర్పించే ఘనమైన నివాళులని ఆయన అన్నారు.అందుకని ఈ నెల 22న నిర్వహించే సంతాప సభకు ఎర్రన్న అభిమానులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయులు, బంధువులు, ప్రజలు, అధిక సంఖ్యలో హాజరుకావాలని భూమయ్య కోరారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, డివిజన్ కార్యదర్శి, దేదావత్ బన్సీ, జిల్లా నాయకులు, బి. సాయిలు, శ్రీనివాసరెడ్డి, సూర్య విట్టల్, లక్ష్మణ్ ,గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



భీంగల్ నవంబర్ 15 జనం సాక్షి:భీంగల్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ సమావేశం ఆదివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.యూనియన్ అధ్యక్షుడిగా గుర్రం విజయ్, ఉపాధ్యక్షులుగా పత్రి బాల, బచ్చలవారి భాగవ్వ, పత్రి సాయమ్మ,ప్రధాన కార్యదర్శిగా బేల్దారి భూమన్న. కాకి కిషన్ ,క్యాషియర్‌గా బచ్చలవారి కాళిదాస్,సలహాదారులుగా సున్నపు ఓంకార్, నవీన్, విజయ, విశ్వనాథ్, రాజారాం, ప్రవీణ్, పోసాని, చెప్పల లక్ష్మి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు యూనియన్ అభివృద్ధికి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి హక్కుల సాధనకు సమిష్టిగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో యూనియన్ సభ్యులు, హరీష్. రఘు. దివ్య. మనోహర్. భాస్కర్. మధు. దశ..సునీత. కాకి తార. మహేందర్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన బీజేపీ నేత సునీల్ రెడ్డి



మంథని, నవంబర్ 15 (జనంసాక్షి) : మంథని నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి మండలం జీడీ నగర్, కన్నుల గ్రామాలలో ఇటీవల మరణించిన రావుల నారాయణ, దండుగుల లచ్చయ్య, తపాల వెంకటి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ పెద్దపల్లి జిల్లా ఉప అధ్యక్షులు మచ్చగిరి రాము, కమాన్‌పూర్ మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్, మట్ట శంకర్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు అరుణ్, కోమిరే లక్ష్మణ్, కంకటి శ్రీను, కంకటి శ్రవణ్ గౌడ్, మబ్బు సాయి కిరణ్, భీమనపల్లి రామచందర్, కల్వ మల్లేష్, సిరిపురం వెంకటేశ్, తుమ్మ రాజయ్య, మెకల నరేష్, లక్ష్మణ్, ధరవేనమొగిలి, కన్నం వెంకటేశ్, దాసరి శ్రీనివాస్, గుండేటి కానుకయ్య, ఎరుప రమేష్, రేణికుంట విజయ్, క్లబ్ సెక్రటరీ అల్లాటెక్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి ఆలయంలో "కార్తీక" శోభ



కమాన్‌పూర్, నవంబర్ 15 (జనం సాక్షి) : పవిత్ర కార్తీక మాసం ఆదివారం కావడంతో కమాన్‌పూర్‌లోని ప్రసిద్ధ శ్రీ ఆదివరాహస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చైర్మన్, పాలకవర్గం, అధికార సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లను సద్వినియోగం చేసుకోండి

మేనేజర్ ఎల్. గాంధీ నాయక్, సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు



రామగిరి జనం సాక్షి :కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కెడీసీసీ)లో అందుబాటులో ఉన్న డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎల్. గాంధీ నాయక్, సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు సూచించారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై కళాకారులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై లభిస్తున్న వడ్డీ రేట్లపై ఖాతా దారులకు అవగాహన కల్పించారు. బ్యాంకులో లాకర్ సౌకర్యంతో పాటు బంగారు ఆభరణాలపై గ్రామకు రూ.9,000 వరకు రుణం, గృహ నిర్మాణ రుణాలు, గృహ కొనుగోలు రుణాలు, విద్యా రుణాలు, వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఖాతాదారులు ఫోన్‌పే, గూగుల్‌పేతో పాటు కేడీసీసీ బ్యాంక్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు పని వేళల్లో 9121014904 నంబర్‌కు ఫోన్ చేస్తే బ్యాంకింగ్ సేవలు, రుణాలు, డిపాజిట్లకు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తామని తెలిపారు.

కొండగట్టులో మానాల అయ్యప్ప స్వాముల ప్రత్యేక పూజలు



రుద్రంగి నవంబర్ 15 (జనం సాక్షి)రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాముల బృందం 60 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న చందనోత్సవం, అంకురార్పణం, మహా సంప్రోక్షణం సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి మానాల గ్రామ ప్రజలు ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆంజనే యస్వామిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. స్వామివారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుమ్ జలపతి, కొక్కుల వంశీ, చెదలు నవీన్, తుమ్ తిరుప తి,యాసోజీ అభి, తుమ్ శ్రీనివాస్, తుమ్ గంగాధర్, భూపతి, నర్సన్న తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం



ఇల్లంతకుంట, నవంబర్ 15 (జనంసాక్షి): ఇల్లంతకుంట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ అంతగిరి సాహిత్య వినయ్ కుమార్, డైరెక్టర్ జెట్టి మల్లేశంలను ఇల్లంతకుంట మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎల్లవేణి రమేష్ ముదిరాజ్, జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ చొప్పరి రామ చంద్రం ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కార్యాలయంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కంకట ప్రభాకర్ ముదిరాజ్, జంగారెడ్డిపల్లె సర్పంచ్ పండుగ తిరుపతి ముదిరాజ్, ఇల్లంతకుంట మాజీ సర్పంచ్ కూనబోయిన బాలరాజు ముదిరాజ్, తుటి పరశురాములు ముదిరాజ్, ఏంట్రా బుచ్చయ్య ముదిరాజ్, ఎండ్ర చందన్ ముదిరాజ్, శ్రీనివాస్, కొమ్ముల నర్సింగం ముదిరాజ్‌తో పాటు జిల్లా, మండలంలోని వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బిజెపి ఎస్టి మోర్చా ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి వేడుకలు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి) : భారతీయ జనతా పార్టీ కరీంన గర్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు రమావత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో భగవాన్ బిర్సా ముండా జయంతి, జాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఎస్టి మోర్చా నాయకులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ... బ్రిటిష్ పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి, అటవీ హక్కులు, ఆదివాసీల ఆత్మగౌరవం కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గిరిజన సమాజం పట్ల ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బిర్సా ముండా జయంతిని 'జనజాతీయ గౌరవ దివస్'గా ప్రకటించడం గిరిజనులకు దక్కిన గౌరవమని తెలిపారు. గిరిజనుల సంక్షేమం, విద్య, ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేలా ఎస్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొట్టే మురళీకృష్ణ, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు గాజుల స్వప్న, కార్పొరేటర్లు బండ రమణ, వెస్ట్ జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి, ఎస్టి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లావుడియా తిరుపతి నాయక్, కార్యదర్శి బానోత్ శివ నాయక్, సోషల్ మీడియా కోకన్వీనర్ మా లోతు దీక్షిత్ నాయక్, బిజెపి నాయకులు, కార్యకర్తలతో పాటు జిల్లా ఎస్టీ మోర్చా పదాధికారులు, బిజెపి జిల్లా నాయకులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

12 గంటల పాటు అలుపెరుగని పరుగు.. వైద్యుల అసాధారణ ప్రతిభ!

'స్టేడియం రన్'లో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి 96 కి.మీ., జగిత్యాల రజినేష్ 72 కి.మీ. పరుగు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: ఆరోగ్యమే అసలైన సంపద అనే సందేశాన్ని సమాజానికి చాటుతూ వైద్యులు తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గడియం స్కూల్‌లో నిర్వహించిన 'స్టేడియం రన్' పోటీల్లో వైద్యులు, రన్నర్లు ఉత్సాహంగా పాల్గొని తమ పట్టుదల, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని చాటుకున్నారు.ఈ పోటీల్లో నిర్వహించిన 12 గంటల సోలో రన్‌లో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి 96 కిలోమీటర్లు, జగిత్యాల రజినేష్ 72 కిలోమీటర్లు పరుగెత్తి అందరినీ ఆకట్టుకున్నారు. నిరంతరంగా 12 గంటల పాటు పరుగు కొనసాగిస్తూ అలసటను, శారీరక ఒత్తిడిని అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవడం విశేషంగా నిలిచింది.అదేవిధంగా రిలే రన్‌లో 'ఇందూర్ డాక్టర్స్' పేరుతో డాక్టర్ శ్రీను నాయక్, డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ జేటీఆర్, డాక్టర్ రవివర్మ, డాక్టర్ పవని, మహేష్‌లతో కూడిన ఆరుగురు సభ్యుల బృందం పాల్గొంది. ఈ బృందం సమిష్టి కృషితో మొత్తం 115 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేసి జట్టు స్ఫూర్తిని చాటుకుంది.వైద్య వృత్తిలో నిత్యం బిజీగా ఉంటూనే వ్యక్తిగత ఆరోగ్యానికి సమయం కేటాయించడం ఈ వైద్యుల ప్రత్యేకత. విధులు నిర్వహిస్తూనే ప్రతిరోజూ వ్యాయామం, నడక, పరుగు వంటి శారీరక కార్యకలాపాలకు సమయం కేటాయిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పరుగు పోటీల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు.వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా ప్రజల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా ప్రేరణ కల్పించడం తమ లక్ష్యమని ఈ బృందం చాటుతోంది. నేటి బిజీ జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పకుండా నడక, పరుగు అలవాటు చేసుకోవాలని వారు సందేశమిస్తున్నారు.ఇతరులకు ఆరోగ్యం గురించి చెప్పడమే కాకుండా, స్వయంగా ఆచరించి చూపిస్తున్న ఈ వైద్యుల కృషి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

కలెక్టరేట్‌లో జనజాతీయ గౌరవ దివస్ వేడుకలు

భగవాన్ బిర్సా ముండాకు ఘన నివాళులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జనజాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, బిర్సా ముండా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి, గిరిజనుల భూ హక్కుల పరిరక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన భగవాన్ బిర్సా ముండా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని శ్లాఘించారు. గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. బిర్సా ముండా పోరాట ఫలితంగానే 1908లో గిరిజనుల హక్కుల పరిరక్షణకు దోహదపడేలా టెనెన్సీ యాక్ట్ రూపొందించబడిందని గుర్తు చేశారు. భారత స్వాతంత్ర్యం అనంతరం గిరిజనుల హక్కులకు రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించడంతో పాటు పార్లమెంట్, శాసనసభలు, పంచాయతీలు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో గిరిజనులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం జరుగుతోందని తెలిపారు. గిరిజనుల గొప్ప చరిత్ర, వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం బిర్సా ముండా జయంతి రోజును జనజాతీయ గౌరవ దివస్ గా నిర్వహిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి భాస్కర్, ఏ.ఓ వేణు మాధవ్, సహదేవ్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ లోకి నీటిని ఎక్కించడానికి రూ. 25 లక్షల తో టెండర్లు పూర్తి



రామగిరి జనం సాక్షి :రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పాత లధ్నాపూర్ ఆర్‌డఆర్ సైట్ (లక్ష్మీ నగర్) ప్లాట్లలో వాటర్ ట్యాంక్ లోకి నీటిని ఎక్కించడానికి టెండర్లు పూర్తయ్యాయి. గత పది సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఐదు లక్షల గ్యాలన్ ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఇది వృధాగా ఉంటుంది. ఈ క్రమంలో డిసెంబర్ 19వ తేదీన జరిగిన సింగరేణి పబ్లిక్ హియరింగ్ లో ఈ వాటర్ ట్యాంక్ వృధాగా ఉందని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు జిల్లా కలెక్టర్ కోయ.శ్రీహర్ష దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన డీ.ఎం.ఎఫ్.టీ నిధుల నుండి రూ.25 లక్షలు మంజూరు చేసారు. దీంతో ఈ వాటర్ ట్యాంక్ లోకి ఎల్లంపల్లి నుండి వచ్చే గోదావరి నీటిని ఎక్కించాలని ఆర్.డబ్ల్యూ. ఎస్ శాఖ ఆధ్వర్యంలో టెండర్లు పూర్తయ్యాయి. సెంటినరీ కాలనీ నుండి తెలంగాణ చౌరస్తా మీదుగా రాణీ రుద్రమదేవి ప్రాంగణం నుండి ఈ వాటర్ ట్యాంక్ వరకు పైప్ లైన్ వేయనున్నారు. సుమారు 800 మీటర్ల పైప్ లైన్ వేసి ఈ వాటర్ ట్యాంక్ లోకి నీటిని ఎక్కించనున్నారు. దీనికిగాను టెండర్లు పూర్తి అయ్యాయి. ఈ వాటర్ ట్యాంక్ లోకి నీటిని ఎక్కించడానికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు స్థానిక సర్పంచ్ ప్రతిమ పీవీరావు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తారని ఆమె తెలిపారు

చందనోత్సాదనం మహాసంప్రోక్షణ కార్యక్రమానికి అంకురార్పణ

బాలాలయ ఉత్సవమూర్తి ప్రతిష్టాపన

కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంఎమ్మెల్యే సత్యం



మల్యాల నవంబర్ 15 (జనం సాక్షి) తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానములో సుమారు 60 సంవత్సరాల అనంతరం నిర్వహించనున్న శ్రీ స్వామివారి నిజరూప దర్శన మహోత్సవానికి చందనోత్సాదనం (తొలగించడం) మహాసంప్రోక్షణ కార్యక్రమానికి ఆదివారం శాస్త్రోక్తంగా వేదపండితులు,అర్చకులు డా.మేడిపల్లి సత్యం చేతుల మీదుగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. చందనోత్సవ దాదాపు గత 60 సంవత్సరాల నుంచి ఆలయ ఆచార సాంప్రదాయాలను అనుసరించి,ప్రతి మంగళవారం,శనివారము స్వామివారికి వేయబడిన సింధూరం,చుట్టబడిన తొలగిస్తారు.బాలాలయ ఉత్సవమూర్తి ప్రతిష్టాపనమూలవిరాట్ పై చందనం తొలగించే సమయంలో నవంబర్ 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు భక్తులకు అసౌకర్యం కలగకుండా బాలాలయ కుమ్భావాహనమ్ చెక్కతో తయారు చేయించిన స్వామివారి ఉత్సవమూర్తిని ప్రతిష్టించి దర్శనం కల్పించారు. చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంఎమ్మెల్యే సత్యంచందనోత్సవం ఎమ్మెల్యే శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.దేవస్థాన అధికారులు,అర్చకులు ఎమ్మెల్యే ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్న మహత్తర చందనోత్సవం నిజరూప దర్శన కార్యక్రమానికి తన చేతుల మీదుగా అంకురార్పణ చేయడం తన పూర్వజన్మ సుకృతంగా,గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. నవంబర్ 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు స్వామివారి మూలవిరాట్టుకు అలంకరించిన చందనాన్ని తొలగించే కార్యక్రమం నిర్వహించబడుతుందని, నవంబర్ 21వ తేదీ నుండి డిసెంబర్ 29వ తేదీ వరకు భక్తులకు శ్రీ స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు.ఆరు దశాబ్దాల అనంతరం లభిస్తున్న ఈ అరుదైన ఆధ్యాత్మిక అవకాశాన్ని ప్రతి ఒక్క భక్తుడు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.మహత్తరమైన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగస్వామి కావడం పునర్జన్మగా,మహాభాగ్యంగా భావిస్తున్నానని, తనకు ప్రాణం ఉన్నంతవరకు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి సేవలో కొనసాగుతానని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఎస్. అంజనా రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు శ్రీ స్వామివారి మూలవిరాట్టుకు అలంకరించిన చందనాన్ని తొలగించే కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడుతుందని తెలిపారు.నవంబర్ 21వ తేదీ నుండి డిసెంబర్ 29వ తేదీ వరకు భక్తులకు శ్రీ స్వామివారి అరుదైన నిజరూప దర్శన భాగ్యం కల్పించబడుతుందని,భక్తులందరూ ఈ మహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు డా.టి. జితేంద్ర ప్రసాద్,చిరంజీవి స్వామి, స్థానాచార్యుడు కపీందర్,ఏఈఓ హరిహరనాథ్, పర్యవేక్షకుడు సునీల్ కుమార్,ఆలయ పరిశీలకుడు అశోక్,లక్ష్మారెడ్డి, సర్పంచ్ ఆదిరెడ్డి,ప్రజాప్రతినిధులు,ఆలయ సిబ్బంది మరి యు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లారీ రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు

టీవీ రిపేర్ చేయించుకుని వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం

మనవడితో వెళ్తున్న వృద్ధుడు దుర్మరణం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి:నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రిపేర్ చేయించుకున్న టీవీని వాహనంపై పెట్టుకుని ప్రియమైన మనవడితో కలిసి ఇంటికి తిరిగి వెళ్తున్న ఓ వృద్ధుడిని లారీ రూపంలో మృత్యువు కబలించింది. అతివేగం, అజాగ్రత్త కారణంగా జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మనవడు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.పోలీసుల కథనం ప్రకారం.సిర్పూర్ గ్రామానికి చెందిన మేదరి లక్ష్మణ్ తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై రిపేర్ చేయించిన టీవీని పెట్టుకుని. తన మనవడు శివానంద్‌తో కలిసి సిర్పూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ నగరంలోని పీఎఫ్ కార్యాలయం సమీపానికి చేరుకోగానే. శాంతి నగర్‌కు చెందిన అన్సార్ ఖాన్ నడుపుతున్న లారీ అత్యంత అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి వారి వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాద తీవ్రతకు మేదరి లక్ష్మణ్ రోడ్డుపై పడి పోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనతో పాటు ప్రయాణిస్తున్న మనవడు శివానంద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కళ్ల ముందే తాత మృతి చెందడంతో ఆ బాలుడు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఐదవ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అన్సార్ ఖాన్‌పై ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఐదవ టౌన్ ఎస్ఐ డి. సునీల్ తెలిపారు .నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి నిండు ప్రాణాలను బలిగొంటున్న ఇలాంటి డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల హామీల అమలుపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి

చెన్నమల్ల చైతన్య

కవితక్కపై ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం



గన్నేరువరం, నవంబర్ 15 (జనంసాక్షి) : గన్నేరువరం మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇన్చార్జ్, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య డిమాండ్ చేశారు. ఆదివారం గన్నేరువరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు.గుండ్లపల్లి-గన్నేరువరం- పొత్తూర్ డబుల్ రోడ్డు ఎక్కడ?గన్నేరువరం మండల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న గుండ్లపల్లి-గన్నేరువరం-పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణంపై ఇప్పటికైనా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ బిల్లుల సమస్య ఉందని చెప్పి ప్రజల సమస్యలను పక్కన పెట్టడం సరైన పరిష్కారం కాదన్నారు. నిధులు ఎప్పుడు విడుదల చేస్తారు? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ఎమ్మెల్యే ప్రకటించాలని డిమాండ్ చేశారు.మానేరు బ్రిడ్జి నిర్మాణం ఏమైంది? మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఇచ్చిన హామీ అమలు ఎక్కడి వరకు వచ్చిందో ప్రజలకు వివరించాలని అన్నారు. సర్వే, ప్రతిపాదనలు, నిధుల మంజూరు వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.స్టడీ సర్కిళ్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ఎప్పుడు?ప్రతి మండలానికి స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ అందించాలని కోరారు. గన్నేరువరం మండలంలో తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల అధ్యక్షులు గువ్వా అభిషేక్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి మొగ్గ మల్లేశం, నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి గువ్వా శ్రీనివాస్, రక్షణ సేన యువ నాయకులు అభిలాష్, అజయ్, నగునూరి చంద్రబోస్, వడ్లకొండ అక్షయ్, పూర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్



కమాన్ పూర్ , నవంబరు 15, (జనంసాక్షి) : గత మూడు రోజుల కిందట అధికారికంగా ఓపెన్ చేసిన ఐకేపీ సెంటర్ల నుంచి ఒక గింజ ధాన్యం కూడా కాంటాలు పెట్టకపోవడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ ఆరోపించారు. పొలాల్లో ఉన్న ధాన్యం తీసుకొచ్చి ఐకేపీ సెంటర్‌లో పోస్తే నిండిపోవడం వల్ల మిగతా రైతులు ఎక్కడ పోయాలో అర్థం కాక అయోమయ స్థితిలో ఉన్నారని, ఇప్పటి వరకు కూడా బర్దాన్ రాలేదని ఆయన అన్నారు. తూతూ మంత్రంగా ప్రారంభించిన కేంద్రాలను గాలికి వదిలేసినా అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. రైతులను రాజులను చేస్తామన్న ప్రభుత్వం, రైతుల వరకు వచ్చేసరికి ఇలా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించాలని, లేదంటే బీజేపీ మండల శాఖ పక్షాన రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కొయ్యడ సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు.

నేడు పెద్దమల్లారెడ్డి సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం

నూతన సొసైటీ చైర్మన్: ఇటిక్యాల సురేందర్ రెడ్డి



భిక్కనూరు నవంబర్ 15 (జనంసాక్షి):భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇటిక్యాల సురేందర్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీకి ఎన్నో ఏళ్లగా అందించిన సేవలు, పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులకు తగిన గుర్తింపు, బాధ్యతలు కల్పించడం అభినందనీయమని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈనియామకంతో పెద్దమల్లారెడ్డి ప్రాంతంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.ఈసందర్భంగా నూతన చైర్మన్ ఇటిక్యాల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో సహకార సంఘం అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.సహకార సంఘం అభివృద్ధికి అందరి సహకారంతో అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ముఖ్యంగా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకార సంఘం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భిక్కనూరు సహకార సంఘం చైర్మన్‌గా లింగాల రాజబాబుగౌడ్ నియామకం

12 మంది డైరెక్టర్లకు నియామక పత్రాలు అందజేసిన షబ్బీర్ అలీ



భిక్కనూరు నవంబర్ 15 (జనంసాక్షి):భిక్కనూరు మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా నియమితులైన లింగాల రాజబాబుగౌడ్‌తో పాటు 12 మంది డైరెక్టర్లకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.ఈసందర్భంగా నూతన చైర్మన్ లింగాల రాజబాబుగౌడ్, డైరెక్టర్లకు షబ్బీర్ అలీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని, రైతుల సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఇలియాస్, భిక్కనూరు గ్రామ సర్పంచ్ బల్యాల రేఖా సుదర్శన్,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామేశ్వరపల్లి సొసైటీ చైర్మన్ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, భిక్కనూరు ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.భిక్కనూరు సహకార సంఘం డైరెక్టర్లు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలియజేశారు.

22న అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవ వేడుకలు



◆స్వర్ణోత్సవ మహాసభలకు వేలాదిగా తరలిరండి

◆స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్ మామిడిపల్లి బాపయ్య

పెద్దపల్లి,నవంబర్ 15(జనంసాక్షి) :

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్,సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య పిలుపునిచ్చారు.ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.ఈ చారిత్రాత్మక వేడుకల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని,జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు,కార్పొరేషన్ పరిధిలోని సంఘం నాయకులు,సభ్యులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,డాక్టర్ వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు,కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి,సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి,శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,మేడిపల్లి సత్యం,జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్, రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి,పెద్దపల్లి పురపాలక సంఘం చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణతో పాటు మాజీ శాసనసభ్యులు,వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సంఘం బలోపేతానికి కృషి చేస్తున్న సుమారు వెయ్యి మంది నాయకులు,కార్యకర్తలకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో స్వర్ణోత్సవ కమిటీ కన్వీనర్ మైస రాజేష్,వైస్ చైర్మన్ లంక సదయ్య,సమన్వయకర్త కుక్క అశోక్,కో-కన్వీనర్ పొనుగంటి రాజనర్సు,సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొంకూరి మధు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి సతీష్,రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం,జిల్లా నాయకులు గుట్ట లింగయ్య, చొప్పదండి మల్లేశం, సంకెనపల్లి లక్ష్మయ్య,నక్క శంకరయ్య,బొల్లి నందయ్య,భూపెల్లి మల్లేశం,బాదె వెంకటేష్,బూడిద సమ్మయ్య,చుంచు మల్లేష్,కాసిపేట పోచయ్య,పెరక బానేష్,బోసెల్లి నారాయణ,కాంపల్లి నరసయ్య,గొట్టే రాజయ్య, కన్నూరి బాబు తదితరులు పాల్గొన్నారు.



వార్డు నిరంతర పర్యవేక్షణ

◆ ప్రజలతో మమేకం

◆ 7,వ వార్డులో ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు తెలుసుకున్న కౌన్సిలర్ ఊట్ల వర ప్రదీప్

సుల్తానాబాద్,నవంబర్ 15(జనంసాక్షి) :



సుల్తానాబాద్ మున్సిపల్ 7వ వార్డులో వార్డు పర్యవేక్షణలో భాగంగా స్థానిక కౌన్సిలర్ ఊట్ల వర ప్రదీప్ వార్డును సందర్శించారు.ఈ సందర్భంగా వార్డులోని ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, వార్డు అభివృద్ధి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న 7వ వార్డు కౌన్సిలర్ ఊట్ల వర ప్రదీప్ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తబిత ఆశ్రమానికి రూ.50వేలు అందజేత

అంతర్గాం, జనంసాక్షి :



పూలవేణి క్రాంతికుమార్-అనిత దంపతుల చిన్న కుమార్తె కృతినందన 3వ పుట్టినరోజు సందర్భంగా తబితా ఆశ్రమానికి రూ.50వేలు అందజేశారు. సాధారణంగా పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య జరుపుకుంటారు. అయితే తమ ఆనందాన్ని ఆశ్రమంలోని పిల్లలతో పంచుకోవాలనే గొప్ప సంకల్పంతో క్రాంతికుమార్ దంపతులు తమ కుమార్తె ప్రత్యేకమైన రోజును తబితా ఆశ్రమంలోని చిన్నారుల మధ్య జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఎంతో ఆనందంగా జరిగాయి.కృతి నందన చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి,వారితో ఆనందకరమైన క్షణాలను పంచుకుంది.ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేయడంతో పాటు వస్త్రాలను కూడా అందజేశారు. అంతేకాకుండా, ఆశ్రమంలోని పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధి మరియు వారి ఉజ్వల భవిష్యత్తు కోసం క్రాంతి కుమార్ దంపతులు రూ.50వేలు అందజేశారు. తబితా ఆశ్రమ వ్యవ స్థాపకులు భూక్యా వీరేందర్ క్రాంతికుమార్, అనిత దంపతులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలి పారు. పిల్లల పట్ల వారు చూపిస్తున్న ప్రేమ, ఆప్యా యత,సహాయ సహకారా లను అభినందించారు. తబితా ఆశ్రమ కుటుంబం తరఫున కృతినందనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన పూలవేణి క్రాంతికుమార్-అనిత దంపతులకు,వారి కుటుంబ సభ్యులకు మరొక్కసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

మహిళా సమస్యల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి



పురుషులతో సమానంగా వేతనాలు అందేలా చూడాలన్నారు.పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు,ప్రసూతి సెలవులను పక్కాగా అమలు చేయాలని,గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు,ఉచిత మందులు అందుబాటులో ఉంచాలన్నారు.బాలికల డ్రాపౌట్లను తగ్గించడానికి ఉన్నత విద్య వరకు ఉచిత విద్యను అందించాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.మహిళలు ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదగడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ,వడ్డీలేని రుణాలను విస్తృతం చేయాలన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళలపై జరుగుతున్న వేధింపులు,సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రత్యేక సైబర్ సెల్ విభాగాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.మహిళలకు గౌరవం, భద్రత లేని సమాజం అభివృద్ధి చెందలేదని,ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు జి.బుచ్చమ్మ, కనకలక్ష్మి, మాడుగుల రజిత, సంధ్య, ఈ.మంగ, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక గుర్తింపు కలిగిన కమాన్‌ను

తొలగించడం బాధాకరం

◆ నూతన కమాన్ నమూనా చిత్రపటాన్ని వెంటనే విడుదల చేయాలి

◆ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్

పెద్దపల్లి,నవంబర్ 15(జనంసాక్షి) :

పెద్దపల్లి పట్టణానికి దశాబ్దాలుగా చారిత్రక గుర్తింపుగా, ఐకానిక్ కట్టడంగా నిలిచిన ప్రధాన కమాన్‌ను తొలగించడం బాధాకరమని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం కమాన్ వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా నూతన కమాన్ నిర్మాణం చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని,అయితే ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, స్థానికుల భావోద్వేగాలతో ముడిపడిన చారిత్రక కమాన్‌ను కూల్చివేయడం సమంజసం కాదన్నారు.నూతనంగా నిర్మించనున్న కమాన్ నమూనా చిత్రపటాన్ని (డిజైన్ బ్లూప్రింట్) వెంటనే అధికారికంగా విడుదల చేసి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి పట్టణ సాంస్కృతిక, చారిత్రక ఆనవాళ్లు ప్రతిబింబించేలా ఆధునిక హంగులతో ఆకర్షణీయంగా నూతన కమాన్‌ను నిర్మించాలని కోరారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చారిత్రక కట్టడాల చట్టం-1958 ప్రకారం 100 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా జిల్లా కలెక్టర్, పురపాలక సంఘం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.కమాన్ పరిసరాల్లో విశాలమైన సర్కిల్ ఏర్పాటు చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని, స్థానిక అధికార యంత్రాంగాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో కుక్క అశోక్,నూనె వెంకటేష్,ఎం.డి.మెహరాజ్,షఫీ,చరణ్,ప్రేమ్,శ్రావణ్,తిరుమల్,రమేష్, అభినవ్,విజయ్,తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి

ఒకప్పటి హేమీ ఊరు.. నేడు సర్పంచ్..



- గాంధారి రూపురేఖలు మార్చి అభివృద్ధికి మారుపేరు గా నిలిచిన నాయకుడు మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్
- సర్పంచ్ బరిలో ఎంతమంది ఉన్నా ఊరంతా అభివృద్ధికి చూసి ఆయనకే పట్టం కట్టారు
- ప్రత్యర్థులు పై ఒకసారి కాదు రెండుసార్లు సర్పంచ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందారు
- నిస్వార్థ సేవ, ఆయన మంచితనం అతని గెలుపు రహస్యం
- ఇంకా ఉన్నత పదవులు పొందాలని ఆశిస్తున్న గాంధారి ప్రజానీకం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 15(జనంసాక్షి)

ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్ని తన సంకల్పబలంతో ఏదో సాధించాలని చిన్నప్పటినుండి అనుకున్న కళ సర్పంచ్ పదవి మెజారిటీ తో గెలిచిన సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ పై స్పెషల్ స్టోరీ.

కుటుంబ నేపథ్యం.... చదువు..

అమ్మ ముమ్మాయి అమ్మాయి నాన్న మమ్మాయి నారాయణలకు ఇద్దరు కొడుకులు అందులో కొడుకు సంజీవ్ యాదవ్ తమ్ముడు భాస్కర్ యాదవ్ పూర్తిగా మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారే సంజీవ్ చిన్నప్పటినుంచే ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న తరుణంలో సామల శేఖర్ వద్ద పేపర్ బాయ్గా పనిచేస్తూ తల్లిదండ్రులకు చేతులు వదోడుగా ఉండేవాడు. అటుపై ఏడో తరగతి నుంచి పదవ తరగతి వరకు గాంధారి హైస్కూల్లో విద్యను అభ్యసిస్తూ బట్టల షాపులో పనిచేస్తూ కొద్ది కొద్దిగా డబ్బులు కూడా పెట్టుకుని తల్లిదండ్రులకు ఆసరాగా నిలిచేవాడు. 24 6 1981 లో జన్మించిన మమ్మాయి సంజీవ్ యాదవ్ ఇంటర్మీడియట్ జి వి ఎస్ కళాశాలలో చదివి అటుపై కామారెడ్డి కోర్సు పూర్తి చేశాడు.

అంచలంచెలుగా ఉన్నత స్థాయి రాంసింగ్ గురువు లాంటివాడు..


గాంధారి మండల కేంద్రంలో అప్పట్లో రామ్ సింగ్ ఎస్ వి పూజా హాస్పిటల్ చాలా పేరు ప్రఖ్యాతలు పొంది ఎప్పటికీ డాక్టర్ అందుబాటులో ఉంటాడని మంచి చికిత్స అందిస్తారని రామ్ సింగ్ పై గాంధారి ప్రజానీకానికి మంచి అభిప్రాయం. అలా హాస్పిటల్ సంజీవ్ పనిచేస్తూ దాదాపు కొన్ని సంవత్సరాలు గడిచింది అటుపై డాక్టర్ రాంసింగ్ ప్రొఫెసర్ గా హైదరాబాదులో పని చేయాల్సి ఉండగా దీనికి తోడు గా హైదర్ నగర్ లో ఎస్ వి పూజా హాస్పిటల్ పేరుతో అక్కడ హాస్పిటల్ ప్రారంభించడం జరిగింది. దీంతో రాంసింగ్ మెడికల్ షాప్ లో పూర్తిగా నమ్మకం కలిగిన వ్యక్తిగా నమ్మి హైదరాబాద్ పూజా హాస్పిటల్ లో మెడికల్ ఆఫర్ ఇవ్వడంతో అప్పటినుండి అతని జీవితం ఓ మలుపు తిరిగింది.

నిస్వార్థ సేవ.... ఆపద ఉందంటే ఎంత దూరమైనా వచ్చేవాడు

2002 వ సంవత్సరంలో డాక్టర్ రామ్ సింగ్ తో పాటు గాంధారిలో ఉన్న ఎస్వీ పూజా హాస్పిటల్ లో తీసివేసి హైదర్ నగర్ హైదరాబాద్ లో ఎస్ వి పూజా హాస్పిటల్ ను ఏర్పాటు చేయడం జరిగింది దీంతో చుట్టుపక్కల ప్రజానీకానికి ఎస్వీ హాస్పిటల్ యొక్క ప్రాముఖ్యతను వివరించేందుకు వివిధ చుట్టుపక్కల జిల్లాల్లో అనేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా 2022 నుండి గాంధారి నుండి వెళ్లిపోయిన సంజు యాదవ్ 2018 వరకు గాంధారి



మండల ప్రజానీకానికి ఆపద ఉందంటే హైదరాబాదులో ఎక్కడ ఉన్నామంటే అక్కడికి వెళ్లి వారి బాగోగులు చూసుకొని అవసరమైతే పూజా హాస్పిటల్ కు లేదా గాంధీ హాస్పిటల్ కు పంపించి వారి యోగక్షేమాలు ఎప్పటికీ అప్పుడు అడిగి తెలుసుకునే వాడు. అంతేకాకుండా నిత్యం ఎవరైనా హైదరాబాద్ కు డాక్టర్లకు ఏ వ్యాధి గురించి ఎవరిని కలవాలో దగ్గరుండి మరి అతనే కల్పించేవాడు. ఇలా గాంధారి ప్రజానీకానికి చాలా ఆపనాస్తంగా మారి అందరి మన్ననలను పొందాడు. అంతేకాకుండా గాంధారిపై ప్రత్యేక శ్రద్ధతో నిత్యం ప్రజల యోగక్షేమాలు తెలుసుకునేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు అందుకోసం ఉచితంగా మందుల పంపిణీ కూడా అందించేవారు.



స్నేహితుల సహకారంతో రాజకీయరంగేట్రం..

స్నేహితుల పదవ తరగతి 1996 97 బ్యాచ్ స్నేహితులందరూ 2018లో ఎలక్షన్లు వస్తున్నాయి పోటీ చేస్తే బాగుంటుందని సలహా ఇవ్వడంతో స్నేహితుల దగ్గర నుండి అందరికీ సహాయ పడే గుణం ఉండడంతో అధిక మెజారిటీతో మొదటిసారిగా రాజకీయంలోకి దిగిన సర్పంచ్ గా గెలిచి రాజకీయారంగేట్రం చేశాడు. దానికోసం ఊరి ప్రజలు ముఖ్యంగా పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు గెలుపు కోసం చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో రెండవసారిగా 2025 లో రెండోసారి మహిళ రిజర్వేషన్ రావడంతో తన భార్య రేణుక ను బరిలోకి దింపి అత్యధిక మెజారిటీతో ప్రత్యర్థి పై రెండు వేల పైచిలుకు ఓటుతో విజయ దుందుభి మోగించారు.

చేసిన అభివృద్ధి పనులు మరలా గెలిపించాయి..

ఒకప్పుడు గాంధారిలో కనీసం వీధి దీపాలు సిసి రోడ్లు ప్రధాన రహదారి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది కానీ మొదటిసారి సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన సంజీవ్ యాదవ్ కు మొదటిగా సవాల్గా అనిపించిన వాటిని గాడిలో పెట్టేంత వరకు ఆలుపెరుగని కృషి చేశారు. స్వయంగా అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఉన్నప్పుడు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని ఎమ్మెల్యే జాజాల సురేందర్ లను పలుమార్లు కలిసి గాంధారి మండలం అభివృద్ధి కోసం నిధులు మంజూరు కోసం చాలా పాటుపడ్డాడు. దీంతో మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ రోడ్ల వెడల్పు, గుండమ్మ కాలువ నిర్మాణం, గల్లీ గల్లీలో సీసీ రోడ్ల నిర్మాణం, ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా తన సొంత ఖర్చులతో హాస్పిటల్లో కూడా నిర్మించాడు. అంతేకాకుండా వివిధ హైదరాబాద్ లోపల పెద్ద పెద్ద కార్పొరేట్ హాస్పిటల్ నుంచి కూడా గాంధారిలో ఎన్నోసార్లు మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేశారు. వీటి మూలంగా కూడా రెండోసారి విజయం ఖాయం చేశాయి.

చేయాల్సిన పనులు.... ఎమ్మెల్యే మదన్ మోహన్ ఇచ్చిన హామీలు

రెండోసారి సర్పంచ్ గా గెలిపించిన తన సతీమణి రేణుక సంజీవ్ యాదవ్ కాంగ్రెస్ లో చేరి అభివృద్ధి పనుల గురించి ఇటీవలే ఎమ్మెల్యేను కలిసి మండలానికి కావాల్సిన అవసరాలను తీర్చడానికి కృషి చేయాలని కోరారు దీంతో ఎమ్మెల్యే కూడా తప్పకుండా సహకరిస్తానని మాట ఇవ్వడం జరిగిందని సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిని అప్గ్రేట్ చేస్తూ, అంగడి బజార్ వేరే చోటికి మారుస్తూ, ముఖరం చెరువు సుందరికరన పనులు పూర్తిగా చేపట్టే విధంగా చూస్తానని తప్పకుండా పోచమ్మరవు బ్రిడ్జి సంఘం బ్రిడ్జి కూడా అది త్వరలోనే పూర్తి అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

నిస్వార్థ సేవే గెలుపు రహస్యమా?.. ఇంకా ఉన్నత పదవులు పొందాలని ప్రజల ఆకాంక్ష..

ప్రజలతో కలిసిమెలిసి ఉండటం, అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరించడం, గ్రామ సమస్యలపై స్పందించడం వంటి అంశాలు ఆయనకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు పేరు ఉందని చెబుతున్నారు. మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్ష.. గాంధారి గ్రామానికి సేవలందించిన సంజీవ్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు, ప్రాంతానికి మరింత సేవ చేయాలని గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఒకప్పుడు పేపర్ బాయ్గా జీవన ప్రస్థానం ప్రారంభించి, ప్రజల ఆదరణతో నాయకుడిగా ఎదిగిన ఆయన ప్రయాణం గాంధారి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం

నిజాంసాగర్ జనంసాక్షి :

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టనుంది. కుటుంబంలో అనుకోని కారణాలతో సభ్యులు ఎవరైనా మరణిస్తే, ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించే విధంగా రూపొందించిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తెలిపారు.కుటుంబ పెద్ద లేదా కుటుంబ సభ్యుడిని కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు తగ్గించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకొస్తోందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ప్రతి గ్రామంలో పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రాధాన్యతను కామారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి మండలానికి తీసుకెళ్లాలని ఏలే మల్లికార్జున్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ క్రియాశీల కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం వివరాలు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాలు, పార్టీ నాయకత్వం సూచనల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ఈ పథకం విజయవంతానికి కృషి చేయాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ కోరారు.

మైలారంలో జియో నెట్‌వర్క్ కష్టాలు తీర్చరా?

- సిగ్నల్ లేక ప్రజలు నరకయాతన
- జియో అధికారులు నిద్రపోతున్నారా?
- బీజేపీ రాష్ట్ర నాయకుడు విలాసాగరం రామచంద్రం ధ్వజం



గన్నేరువరం, నవంబర్ 15 (జనంసాక్షి):

గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో జియో నెట్‌వర్క్ పూర్తిగా పడకేసింది. సిగ్నల్ కోసం ప్రజలు చెట్లెక్కాల్సిన దుస్థితి వచ్చింది. పది రోజులుగా కాల్ చేసినా కలవదు, కలిసినా మధ్యలోనే కట్ అవుతుంది. నెట్ ఆన్ చేస్తే గుండ్రంగా తిరుగుతూనే ఉంటుంది తప్ప పని జరగడం లేదు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కు ఫోన్ చేయాలన్నా, డబ్బులు పంపాలన్నా, పిల్లలు ఆన్ లైన్ లో చదువుకోవాలన్నా సిగ్నల్ అడ్డుపడుతోంది. డబ్బులు కట్టించుకోవడంలో ముందుండే జియో, సేవలు ఇవ్వడంలో మాత్రం వెనకబడిపోయింది."కస్టమర్ నుంచి రీచార్జ్ డబ్బులు వసూలు చేయడం మాత్రమే తెలుసా? సేవలు ఇవ్వడం తెలియదా?" అంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు విలాసాగరం రామచంద్రం జియో అధికారులపై మండిపడ్డారు. ఇది ఒక్కరోజు సమస్య కాదు, పది రోజులుగా ప్రజలు మొత్తుకుంటున్నా జియో అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో టవర్ ఉన్నా సిగ్నల్ లేకపోవడం అంటే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.వెంటనే స్పందించకపోతే గ్రామస్తులతో కలిసి జియో కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని రామచంద్రం హెచ్చరించారు. మైలారం ప్రజల సహనాన్ని ఇంక పరీక్షించవద్దు. వెంటనే టవర్ మరమ్మతులు చేసి, పూర్తి స్థాయి నెట్‌వర్క్ అందించాలని డిమాండ్ చేశారు.



వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న చల్మెడ

రుద్రంగి నవంబర్ 15 (జనంసాక్షి):

మండల కేంద్రంలోని శుభం గార్డెన్ లో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారామ్ సోదరులు ఆకుల భూమా రెడ్డి కుమారుడి రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది.ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్ చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి వెంట మాజీ ఎంపీపీ స్వరూప మహేష్, వార్డు సభ్యులు ఉప్పులేటి గణేష్, చెప్యాల రవళి గణేష్, సీనియర్ నాయకులు కంటే రెడ్డి, ప్రశాంత్, నారాయణ, రవి, అంబటి రాములు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

దండోరా ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలి

ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సరికెల పోశెట్టి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనంసాక్షి:

దండోరా ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సరికెల పోశెట్టి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తొమ్మిదవ డివిజన్లో మాదిగ యువత కు దండోరా ఉద్యమంలో పాల్గొనాలని ఇంటింటికి ప్రచారం చేయడం జరిగింది.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మధ్యాహ్నం 2 గంటలకు జరగబోయే నిజామాబాద్ అర్బన్ మాదిగ విద్యార్థి సమాఖ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని నిజామాబాద్ నగర మాదిగ యువతను సభ్యులను కోరారు. కార్యక్రమంలో మాదిగ యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అఖిల్, ఉపాధ్యక్షుడు సిద్దు, ప్రధాన కార్యదర్శి బన్నీ, కోశాధికారి మురళి, కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ననపునూరు శివ, అంతరపుల సురేష్, అంతరపుల ప్రమోద్, రాకేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

నూతన పింఛన్లు, కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నిజాంసాగర్ జనంసాక్షి :



పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పేర్కొన్నారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంక్షేమ కార్య క్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధి దారులకు నూతన పింఛన్లు మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పిం చడంతో పాటు, ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఇతర అర్హులైన వారికి పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు.అలాగే ఆడపిల్లల వివాహ సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఉపయోగపడుతున్నాయని వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాల్లో ఆర్థిక భరోసా, సామాజిక భద్రత పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

30 లక్షల ఆటో కుటుంబాల సత్తా ఏందో చూపిస్తం

గోదావరిఖని, జనంసాక్షి :



30లక్షల ఆటో కుటుంబాల సత్తా ఏందో చూపిస్తమని కరీంనగర్ జిల్లా ఆటో జేఏసీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ అన్నారు.కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మద్దెల రాజేందర్ (నాన్ పొలిటికల్ జేఏసీ) అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఆటో సంక్షేమ బోర్డు, 12వేల రూపాయలు, ఆటోనగర్, ఆటోకు స్టేట్ పర్మిట్ తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానంతరం జిల్లా ఆడహాక్ కమిటీని ఎన్నుకున్నారు.కరీంనగర్ జిల్లా కన్వీనర్ రామోజు పురుషోత్తమాచారి, జిల్లా కో-కన్వీనర్ నాగుల మహేందర్,జిల్లా కో-కన్వీనర్ ఎండి హుస్సేన్, ఆరే మల్లారెడ్డి,బుర్ర అశోక్, అంతడుపుల లక్ష్మణ్ నలుగురిని జిల్లా కో-కన్వీనర్లుగా నియమించామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్కె జబ్బార్, పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ ఎనగందుల నాంపల్లి, కందుల సంపత్ మండల అధ్యక్షులు,బుర్ర సంజీవ్, మొగిలి నరేందర్,బలుసుల సంపత్,పోతార్ల వేణు,అమితాబ్, కొండన్న, శ్రీనివాస్ తదితరులు 100 మంది ఆటోడ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారి అభినవ్ ప్రాణాలు కాపాడండి - నిరుపేద తల్లిదండ్రుల వేడుకోలు

- రూ.50,000 ఆర్థిక సాయం అందజేసిన డిసిసి ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య

మంథని, నవంబర్ 15 (జనంసాక్షి) :

పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి మండలం జీడీ నగర్ కు చెందిన వడ్డెర కులానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అభినవ్ ఫీవర్ తో బాధపడుతూ.. నిమోనియా కింద మారి తీవ్ర అనారోగ్యంతో కరీంనగర్ లోని ఓ ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించాలని వైద్యులు తెలిపారు. లారీ డ్రైవర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే నిరుపేద కుటుంబానికి చెందిన ఆ చిన్నారి తండ్రి దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ విషయం తెలుసుకొని చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు తన వంతు బాధ్యతగా రూ.50,000 ఆర్థిక సహాయం అందించి పెద్దపల్లి డి.సి.సి ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని, తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, చిన్నారి చికిత్సకు పెద్ద మొత్తంలో ఆర్థిక చేయూత అందించడం అభినందనీయం. చిన్నారి అభినవ్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఈ సందర్భంగా సూర సమ్మయ్య తెలియజేశారు. ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించి చిన్నారి ప్రాణాలు కాపాడడంలో తమ వంతు సహాయం అందించాలని సూర సమ్మయ్య ఈ సందర్భంగా కోరారు. సహాయం చేయదలచిన దాతలు.. 7601077281 నెంబర్ కు ఫోన్ పే చేయాలని కోరారు.

